సాక్షి
మెదక్
బుధవారం | 13 | ఆగస్టు | 2025



ఆటాడుకుందాం రా

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి తోడ్పడే క్రీడా పోటీలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. వివరాలు 8లో ▸



చెక్‌డ్యాం నిధుల జాడేది

నారింజ ప్రాజెక్టు నీళ్లు పక్కరాష్ట్రం పాలవకుండా ప్రతిపాదించిన చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు కాలేదు. వివరాలు 8లో ▸



ముమ్మరంగా కార్డెన్‌సెర్చ్

నేర నియంత్రణలో భాగంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. వివరాలు 9లో ▸

దుర్గమ్మ ఆలయంపై త్రిశూలం


పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గామాత ఆలయంపై హైదరాబాద్‌కు చెందిన భక్తులు రమేశ్‌సింగ్ త్రిశూలం ఏర్పాటు చేశారు. రాత్రివేళ విద్యుత్ దీపాలతో త్రిశూలం దూరప్రాంతం వరకు కనువిందు చేస్తుంది.



ఆలయంపై ఏర్పాటు చేసిన త్రిశూలం



కూచన్‌పల్లి చెక్‌డ్యాం



ఘనపూర్ ప్రాజెక్టు



హల్దీ ప్రాజెక్టు

చెరువులకు జలకళ

- ఊపందుకున్న వరినాట్లు
- పెరిగిన భూగర్భ జలాలు

మొత్తం చెరువులు 2,632	
100 శాతం నిండినవి	143
75 శాతం నిండినవి	272
50 శాతం నిండినవి	503
25 శాతం నిండినవి	1,674
పొంగి పొర్లుతున్నవి	40

మెదక్‌జోన్: ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీటి వనరులు నిండాయి. ఫలితంగా ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,632 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇప్పటి వరకు 143 చెరువులు వంద శాతం నిండగా.. 40 చెరువులు మత్తళ్లు, 272 చెరువులు 75 శాతం నిండాయి. మంజీరా నది, హల్దీ, ఘనాపూర్ ప్రాజెక్టులు పొంగి పొర్లుతున్నాయి. హల్దీ ప్రాజెక్టుపై నిర్మించిన చెక్ డ్యామ్‌లు పూర్తిగా నిండాయి. జులై మాసంలో నారుమళ్లు (తుకాలు) పోసిన రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నాట్లను వేస్తున్నారు. ఈ ఏడాది అన్నిరకాల పంటలు 3.50 లక్షల ఎకరాలలో సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 50 వేల ఎకరాలలో ఆరుతడి పంటలు, 2.60 లక్షల ఎకరాలలో వరినాట్లు వేశారు. ఇంకా 40 వేల ఎకరాలలో వరినాట్లు వేసే అవకాశం ఉంది. జిల్లాలో ఘనాపూర్, హల్దీప్రాజెక్టులు ఉన్నాయి. ఘనాపూర్ ప్రాజెక్టు పరిధిలో ఎంఎన్ 43 కిలోమీటర్ల పొడవు ఉండగా.. ఎఫ్‌ఎం కెనాల్ 39 కిలోమీటర్ల మేర ఉంది. ఇవి పాపన్నపేట, కొల్చారం, మెదక్, హవేళిఘనాపూర్ మండలాల పరిధిలో ఉండగా.. 21,625 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఈ కెనాళ్లు ప్రవహిస్తున్నాయి. అలాగే హల్దీ ప్రాజెక్టు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ప్రారంభమై హవేళిఘనాపూర్ మండలం సర్దన వరకు ఉంది. దీని పొడవు 57 కిలోమీటర్లు కాగా.. ఈ ప్రాజెక్టుపై 29 చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. దీని పరిధిలో వర్గల్, తూప్రాన్, వెల్దుర్తి, కొల్చారం, మెదక్ మండలాల పరిధిలో సుమారు 20 వేల పైచిలుకు ఆయకట్టు ఉంది.

న్యూస్‌రీల్

మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు సహించం

పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పదేళ్లు ఎంపీగా ఉండి దుబ్బాకకు ఏం చేశారో చెప్పాలని పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వడియారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రులను అవమానించే విధంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కేసీఆర్, హరీశ్‌రావు చెప్పిన మాటలను పక్కన పెట్టి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. పార్టీలకతీతంగా పనిచేస్తే సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ప్రశాంత్, స్వామి, రాజిరెడ్డి, ఐలయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం: డీఎంహెచ్‌ఓ



నార్సింగి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎం

చిన్నశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు. మంగళవారం నార్సింగి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. కుక్క, పాముకాటుకు అవసరమైన మందులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. గర్భిణులకు అందించే వైద్యం, పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్‌కు పలు సూచనలు చేశారు.

ఆ జీఓలను వెంటనే సవరించాలి

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం వేతన సవరణ చేస్తూ తీసుకొచ్చిన ఐదు ప్రిలిమినరీ జీఓలను వెంటనే సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 2021 సంవత్సరంలో విడుదల చేసిన కనీస వేతనాల ఐదు రకాల జీవోలను యథాతథంగా వెంటనే గెజిట్ చేయాలన్నారు. 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ సంబంధించిన 68 రకాల జీఓలను ప్రభుత్వం సవరించడం లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు జారీ చేసిన జీఓలను గెజిట్ చేయకపోవడం వల్ల ప్రతినెలా రూ.6వేల కోట్లు కార్మికులు నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీఓలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సంతోష్, శ్రీనాథ్, శ్రీకాంత్, మల్లేష్, శేఖర్, రాములు, అజయ్, సత్యం, పాల్గొన్నారు.

ప్రమాదాలకు చెక్ పెట్టాలి

- పరిశ్రమల్లో తనిఖీలు చేసి నివేదికలు సమర్పించండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు ఇతర శాఖల అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని రసాయన, ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో ఫ్యాక్టరీలు, రసాయన పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు భద్రతపై దృష్టి సారిస్తూ కర్మాగారాలలో పనిచేసే కార్మికుల పూర్తి సమాచారం యాజమాన్యం దగ్గర ఉండాలని సూచించారు. కార్మికులు మత్తు పదార్థాలు వాడుతున్నట్లు తమ దృష్టికి వస్తే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమల్లో అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ ఆయా రసాయనిక పరిశ్రమలు, ఔషధ యూనిట్లను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ నగేష్ , ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జయచంద్రారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబు, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావు, కర్మాగారాల జిల్లా ఉప ప్రధాన అధికారి లక్ష్మికుమారి, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు, జిల్లా అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, తదితర శాఖధికారులు పాల్గొన్నారు.

సౌర ప్లాంట్లపై మూడు రోజుల్లో నివేదిక

జిల్లాలో సౌర విద్యుత్ ఏర్పాటు కోసం మూడు రోజుల్లో నివేదికలు అందజేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డి, రెడ్‌కో డీఎం రవీందర్ చౌహాన్‌లతో తదితరులతో కలసి సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, అన్ని యాజమాన్యాల గురుకులాలలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ మేరకు ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన వైశాల్యం, నెలకు విద్యుత్ వినియోగం వంటి వివరాలను నిర్ణీత నమూనాలో పూర్తిచేసి మూడు రోజుల్లోగా నివేదికలు అందించాలని ఆదేశించారు. కాగా, జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

పౌష్టికాహారం అందించాలి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిషత్ కార్యాలయం, పశువైద్యశాల, కల్వకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కల్వకుంటలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిజాంపేట మండలం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఇళ్లు త్వరితగతిన నిర్మించుకుంటే ప్రభుత్వం వెంటనే బిల్లులు జమ చేయనున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో రాజిరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

ఉద్యోగులకు సెలవులు రద్దు: కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జిల్లాలోని ఆయా శాఖల అధికారులతో వర్షాల నేపథ్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని తెలిపారు. వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు 9391942254 సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ నేపథ్యంలో 13, 14, 15 మూడు రోజులు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు, సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. అందరూ అందుబాటులో ఉండాలన్నారు. కాగా జిల్లాలో 11 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో పురాతన కోళ్ల ఫారాలు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి , విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.

అగ్గి రాజేసిన కబ్జా వార్త

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటల యుద్ధం
- మాజీ ఎమ్మెల్యేపై దాడికి యత్నం
- పెద్దశంకరంపేటలో ఉద్రిక్తత



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పెద్దశంకరంపేట(మెదక్): సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్త కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య అగ్గిరాజేసింది. పరస్పర దాడులకు దారి తీసింది. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన మంగళవారం పెద్దశంకరంపేటలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో 'మీరంటే మీరు'అంటూ ఇరు పార్టీల మధ్య వాట్సాప్‌లో చర్చ సాగింది. చివరకు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకునే స్థాయికి చేరింది. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఇంటి ముట్టడికి వచ్చారు. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంట్లో లేకపోవడంతో రోడ్డుపైనే ఆందోళనకు దిగారు. అదే సమయంలో మండల పరిధిలోని జూకల్‌లో పర్యటన ముగించుకొని పెద్దశంకరంపేటకు వచ్చిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్‌ను చూసి అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కోపోద్రిక్తులయ్యారు. నినాదాలు చేస్తూ భూపాల్‌రెడ్డి వాహనంపై ఒక్కసారిగా దాడికి యత్నించారు. ఎస్‌ఐ.ప్రవీణ్‌రెడ్డి తన సిబ్బందితో కలసి ఆందోళనకారులను చెదరగొట్టారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం, వాట్సాప్ గ్రూపులలో ఒకరిపై ఒకరు దూషణలకు పాల్పడితే అడ్మిన్‌తో పాటు అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీఎల్‌ఎంతో బోధన సులువు

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- పెద్దశంకరంపేటలో టీఎల్‌ఎం మేళా ప్రారంభం



పెద్దశంకరంపేటలో టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న డీఈఓ

పెద్దశంకరంపేట(మెదక్): బోధనాభ్యాస సామగ్రి మేళ (టీఎల్‌ఎం)తో బోధించడం ఉపాధ్యాయులకు సులభమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలో టీఎల్‌ఎం మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యాస సామగ్రిని పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎంతో తరగతి గదిలోని చివరి విద్యార్థికి కూడా అర్థమయ్యేలా బోధన ఉండాలని, ఎఫ్‌ఎల్‌ఎంలో జిల్లా ముందుందని చెప్పారు. ఈ నెల 19న జిల్లా స్థాయి మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విఠల్, అశోక్‌రెడ్డి, హెచ్‌ఎంలు మారుతి, బి.శ్రీనివాస్, సత్యకుమార్, కుమార్, ఎన్.శ్రీనివాస్, ఆనంద్, ప్రసన్న, రాములు, గోపి, రిటైర్డు హెచ్‌ఎంలు రామచంద్రాచారి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చందాయిపేటలో కస్తూర్బా పాఠశాల

చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో వృథాగా ఉన్న ఉన్నత పాఠశాల భవనాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను సమన్వయపరిచి చందాయిపేటలో మాసాయిపేట మండల కస్తూర్బా పాఠశాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని చెప్పారు. పీఎంశ్రీ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు కిషన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమర్ శేఖర్‌రెడ్డి, తపస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, నర్సింలు, ఊర్మిల తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే రోహిత్‌రావు
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న రోహిత్‌రావు

మెదక్‌జోన్: తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం పట్టణంలో నియోజకవర్గంలోని 223 మంది లబ్ధిదారులకు రూ.63 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని చెప్పారు. ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. రామాయంపేటలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. తమ ప్రభుత్వం అర్హులందరికీ కార్డులు ఇచ్చి పేదలకు అండగా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ టి.చంద్రపాల్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, శంకర్, బ్లాక్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పవన్, శ్రీనివాస్ చౌదరి, మహేందర్ రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ మెదక్, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులు మల్లేశంగౌడ్, శంకర్ తదితరులు

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ కోరారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి 300 మీటర్ల జాతీయజెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం పనిచేస్తున్న సైనికులకు మద్దతుగా నిలవాలని కోరారు. సిద్దిపేట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, సత్యపాల్‌రెడ్డి, లింగారెడ్డి, గోవింద్, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు, లక్ష్మణ్, శ్రీనివాస్, హరిబాబు, రాకేష్, గురుపాదం, నరేష్, రమేష్, స్వామి, లక్ష్మణ్, దుర్గేష్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకులో.. నిల్వలు నిల్!

కొన్ని గ్రూపులు పూర్తిగా ఖాళీ

- మరికొన్ని అంతంత మాత్రమే..
- పట్టించుకోని వైద్యాధికారులు
- అత్యవసర సమయంలో రక్తం అందక అవస్థలు



బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వల వివరాలు

మెదక్ మున్సిపాలిటీ: బ్లడ్ బ్యాంకులో నిల్వలు నిండుకున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు అత్యవసర సమయాల్లో రక్త యూనిట్ అందక అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లాలో రక్తమార్పిడికి అవసరమయ్యే రోగుల సంఖ్య పెరిగింది. కానీ అస్థాయిలో రక్త నిల్వలు పెరగడం లేదు. దీంతో వైద్యసేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తగ్గిపోయిన నిల్వలు

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు, శస్త్ర చికిత్స సమయంలో రోగులకు రక్తం యూనిట్లు అవసరం ఉంటుంది. ఇందుకోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో రక్తం నిల్వలు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు పిలుపునిస్తున్నారు. కార్యాలయాలు, గ్రామాల్లో ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ, జిల్లాలో అవసరాలకు రక్త నిల్వలు సరిపోవడం లేదు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్‌లో కొన్ని రకాల బ్లడ్ యూనిట్లు పూర్తిగా ఖాళీ అయినట్లు తెలుస్తోంది.

కారణాలు ఇవే..

సాధారణంగా ఏ బాధితుడికి రక్తం ఇచ్చినా, ప్రత్యామ్నాయంగా అతడి సంబంధీకుల నుంచి రక్తం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల రక్త నిల్వలు తగ్గిపోకుండా ఉంటాయి. రక్తం అవసరమైన బాధితుల బంధువులు, స్నేహితులకు అవగాహన కల్పించపోవడమే నిల్వలు తగ్గిపోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. మరోవైపు రక్తదాతలను ప్రోత్సహించక పోవడం, రక్తం రిప్లేస్‌మెంట్ చేయక పోవడం వల్ల జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

> **దాతలు ముందుకు రావాలి**
>
> రేర్ గ్రూపు రక్త యూనిట్లు అందుబాటులో ఉండటం కష్టం. వాటిని అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నాం. ఒక రక్తం యూనిట్ కేవలం నెలరోజులు మాత్రమే ఉంటుంది. జిల్లాలోని రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, మానవతామూర్తులు స్పందించాలి. రక్తదానం చేయాలనుకుంటే 8977173917 నంబర్‌లో సంప్రదించాలి.
>
> – అశోక్, టెక్నీషియన్, బ్లడ్ బ్యాంక్, మెదక్

ప్రైవేట్‌లో ఇలా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే బాధితులకు రక్తం అవసరమైనప్పుడు ప్రభుత్వ నిల్వ కేంద్రంలోనూ లభించడం లేదు. దీంతో ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల్లో ఒక యూనిట్ బ్లడ్‌కు రూ.1,200 నుంచి 1,400 వరకు వసూలు చేస్తున్నారు. అయితే రక్తం యూనిట్‌కు డబ్బులు చెల్లించలేని నిరుపేదల నుంచి అదేస్థాయిలో యూనిట్ రక్తం తీసుకుంటున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రావురూకులలో విషాదం

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో యువతి మృతి


శ్రీజ

సిద్దిపేటరూరల్: రావురూకుల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన యువతి మృతి చెందింది. వివరాలు... మండలంలోని రావురూకుల గ్రామానికి చెందిన లక్కరసు శ్రీనివాస్ వర్మ, హేమలత కొన్నేళ్ల క్రితం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మకు వలస వచ్చారు. వారికి శ్రీజ, శ్రేయ ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఉన్నత చదువుల కోసం శ్రీజ అమెరికాకు వెళ్లి ఇటీవల ఎంఎస్ పూర్తి చేసింది. కాగా సోమవారం రాత్రి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసి తన రూమ్‌కు కారులో వెళ్తుంది. ఈ క్రమంలో కారును ట్రక్కు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై స్పాట్‌లోనే చనిపోయింది. దీంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.శ్రీజ చెల్లెలు శ్రేయ కూడా ఇటీవలే ఎంఎస్ చదివేందుకు అమెరికాకు వెళ్లింది. కూతురు చనిపోవడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

టీవీ,సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

దుబ్బాకరూరల్: విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాత బెల్లోజి రమేశ్ సహకారంతో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, హెచ్ఎంలు నీలం శ్రీనివాస్, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల నిరసన

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం నుంచి వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నామని గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎర్ర పోచయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దౌల్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముత్యం, కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి శంకరయ్య కోశాధికారి సాయిలు, కమిటీ సభ్యులు, శాంతమ్మ, బాలమణి, యాదయ్య, పోచయ్య, రాజయ్య, నరేశ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రమణ

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నల్గొండకు చెందిన తిరుపతి బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం వచ్చి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటిలో నివాసం ఉంటూ స్థానికంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తిరుపతి భార్య రమణ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి..

సంగారెడ్డి క్రైమ్: ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పాపన్నపేట మండలం పాపన్నపేట గ్రామానికి చెందిన చాకలి ఎల్లయ్య(42), బంధువుల చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాడు. ప్రతిరోజు సాయంత్రం తరచూ కల్లు తాగే అలవాటు ఉండటంతో సోమవారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో దూకి యువతి ఆత్మహత్య

తూప్రాన్: మానసిక స్థితి సరిగా లేని యువతి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... మాసాయిపేట మండలానికి చెందిన గుడ్డి లక్ష్మికి ఇద్దరు కూతుళ్లు. కొంత కాలంగా తూప్రాన్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. చిన్న కూతురు శ్రావణి(18) ఇంటర్ మొదటి సంవత్సరం చదివి ఆరోగ్యం సరిగా లేక చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లోంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మంగళవారం చెరువులో శవమై తేలింది. ఈ విషయాన్ని మృతురాలి తల్లికి సమాచారం అందించారు.

మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం... ఈ నెల 10న గజ్వేల్‌లో యూనియన్ బ్యాంకు ప్రాంతంలో ఓ వ్యక్తి మూర్ఛవ్యాధితో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు 108లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతి చెందిన వ్యక్తి గజ్వేల్‌లో భిక్షాటన చేస్తూ బతికేవాడని తెలిపారు.

ఆటాడుకుందాం రా!

20 నుంచి మండల స్థాయిలో..
- సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి పోటీలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు క్రీడలు దోహదపడతాయి. చదువుతోపాటు వారికిష్టమైన క్రీడాపోటీలను ప్రభుత్వం ప్రతియేటా నిర్వహిస్తుంది. ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడంచెలలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించేందుకు అధికారులు దృష్టి సారించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలో 990 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 211 ఉన్నత, 22 కేజీబీవీలు, 10 మోడల్, 109 గురుకుల, సాంఘిక సంక్షేమ పాఠశాలలు ఉన్నాయి. అలాగే సుమారు 500 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.40లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అండర్ 14, అండర్ 17 విభాగంలో బాల, బాలికలు పాల్గొననున్నారు.

ఆటలు ఇవే..

ఎస్‌జీఎఫ్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, కరాటే, బ్యాడ్మింటన్, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బేస్ బాల్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, షటిల్, చదరంగం, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, పెన్సింగ్, క్రికెట్, రెజ్లింగ్ తదితర క్రీడలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో బాల,బాలికలు పాల్గొంటారు. అయితే మండల స్థాయిలో మాత్రం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటలు మాత్రమే నిర్వహిస్తామని, మిగతా ఆటలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.


ఆటలు ఆడుతున్న విద్యార్థులు(ఫైల్)

పది రోజుల పాటు పోటీలు

ఈ నెల 20 నుంచి మండల స్థాయి క్రీడలు ప్రారంభం కానున్నాయి. పది రోజుల పాటు పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ ఆటలు మాత్రమే నిర్వహిస్తారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో జిల్లా స్థాయి, అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. గెలిచిన వారికి అధికారులు ధ్రువపత్రాలు అందజేస్తారు. అవి భవిష్యత్‌లో ఉద్యోగ నియామకాల్లో ఉపయోగపడతాయి. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఈనెల 20 నుంచి మండల స్థాయిలో క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆడిస్తాం. మిగతా ఆటలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తాం. ఎంఈఓ, పీడీ కలిసి ఈనెల 30లోపు మండల స్థాయి పోటీలు పూర్తి చేయాలి. అందులో గెలిచిన వారికి వచ్చే నెలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తాం.

– శ్రీనివాస్ రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

పకడ్బందీగా నిర్వహిస్తాం



జిల్లాలో క్రీడాపోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్వహణ కోసం మండలానికి రూ.10వేల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈనెలలో మండల స్థాయి పోటీలు పూర్తి చేసి, సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తాం. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

'ములుగు'తో కపిల్ ఒప్పందం

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన కపిల్ ఆగ్రో పామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య మంగళవారం అధికారులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. వర్సిటీ వీసీ డాక్టర్. రాజిరెడ్డి, కపిల్ పామ్స్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, అధిక దిగుబడి, పంట ఉత్పత్తి కోసం సాంకేతిక బదిలీపై దృష్టి సారించడమే లక్ష్యమన్నారు. అలాగే ఉద్యానవనంలో ఉమ్మడి విద్య, పరిశోధన, విస్తరణ కార్యకలాపాలను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దీనివల్ల వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు వినూత్న ఇండో ఇజ్రాయెల్ వ్యవసాయ పద్ధతులు, ఇంటిగ్రేటెడ్ నేల, ఆకు విశ్లేషణ తదితర అంశాల గురించి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

టీఎల్ఎం మేళాకు స్పందన


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్‌రూరల్: మండలంలో మంగళవారం నిర్వహించిన టీఎల్ఎం మేళాకు విశేష స్పందన లభించింది. మంగళవారం ఎంఈఓ తారాసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఈ–టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రిపేర్ చేసుకుని వచ్చి టీఎల్ఎం గురించి వివరించారు. ఈ మేళాలో 50 పాఠశాలలు పాల్గొనగా.. వాటిలో ఉత్తమంగా ప్రిపేర్ చేసిన 10 పాఠశాలలను గుర్తించి జిల్లాకు పంపించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రామకృష్ణ, మల్లయ్య, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్ర బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

వర్గల్(గజ్వేల్): ఈ నెల 16 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు బాలికలు, బాలుర జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధు యాదవ్ తెలిపారు. మంగళవారం సెంటారు విశ్వశాంతి గ్రౌండ్స్‌లో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించి ఒక్కో జట్టుకు నుంచి 18 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌పై సమీక్ష నిర్వహించి, టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాల కట్టడికి అవగాహన ఒక్కటే మార్గమని, అందుకు ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ వారియర్స్ ఫోన్ కాల్స్‌కు త్వరితగతిన స్పందించి, బాధితులకు కచ్చితమైన సమాచారం అందించాలని తెలిపారు. సైబర్ వర్టికల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని సుచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సైబర్ సెల్ సిబ్బంది ఉన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

తాళం పగులగొట్టి భారీ చోరీ

రూ.5లక్షలు, వెండి ఆభరణాలు అపహరణ


డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇంట్లో దొంగలు పడి నగదు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటన మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కర్రె మాధవి భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా రైతు బీమా ద్వారా రూ. 5లక్షలు వచ్చాయి. ఆ డబ్బులను బంధువులకు అప్పుగా ఇవ్వగా ఇటీవల తిరిగిచ్చారు. ఈ డబ్బు, 12 తులాల వెండి గొలుసులు, అర తులం గోల్డ్ రింగును బీరువాలో పెట్టింది. శనివారం రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి అమ్మగారి గ్రామమైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అద్రాసిపల్లికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు మాధవికి సమాచారం అందించారు. వెంటనే ఇంటికొచ్చి చూడగా బీరువాలో ఉన్న నగదు, వెండి, బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు తెలుపగా.. ఎస్ఐ కృష్ణారెడ్డి, గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వచ్చి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు బృందాలను రంగంలోకి దింపారు.

బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో...

సంగారెడ్డి క్రైమ్: ఉద్యోగి ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు దోచుకెళ్లారు. పట్టణ సీఐ రమేశ్ వివరాల ప్రకారం.. రాయికోడు మండలం పాంపాడు గ్రామానికి చెందిన బోరంచ నర్సింహులు వృత్తిరీత్యా పట్టణంలోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాపిల్లలతో కలిసి మధురానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 8న రాఖీ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లాడు. భార్య శశికళ, పిల్లలతో కలిసి అదే కాలనీలో ఉండే చిన్నమ్మ ఇంటికి ఈనెల 11న రాత్రి పడుకోవడానికి వెళ్లింది. 12న వచ్చి చూడగానే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని మూడున్నర తులాల బంగారం, డబ్బు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాప్‌లో చోరీకి యత్నం..


షాప్‌లో చోరీకి యత్నిస్తున్న వ్యక్తి

సిద్దిపేటకమాన్: షెట్టర్ తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో బీజేఆర్ చౌరస్తాలో రామచంద్రం వైష్ణవి మెడికల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే షాప్‌ను సోమవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుడు షెట్టర్ తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి క్యాష్ కౌంటర్‌లో డబ్బుల కోసం వెతికాడు. నగదు లేకపోవడంతో వెళ్లిపోయాడు. ఇదంతా షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. షాప్ యజమాని ఉదయం చూసి పోలీసులకు సమాచారం అందించగా.. క్లూస్ టీం సిబ్బంది వచ్చి వేలిముద్రలు సేకరించారు.

ఖజానాలో చోరీ.. పోలీసుల తనిఖీలు


జహీరాబాద్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జహీరాబాద్: హైదరాబాద్‌లోని చందానగర్‌లో గల ఖజానా జ్యూవెలరీ దుకాణంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. దీంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు జహీరాబాద్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. డీఎస్పీ సైదా ఆధ్వర్యంలో సీఐ శివలింగం, ఎస్ఐలు కాశీనాథ్, వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి మండలంలోని హుగ్గెల్లి బైపాస్ వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన నిందితులు ముగ్గురు మోటారు సైకిల్‌పై జహీరాబాద్ వైపు పారిపోయారని వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయినా నిందితుల జాడ దొరకలేదు. మరో మార్గం నుంచి పారిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు.

చోరీలే వృత్తిగా చేసుకుని..

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలు సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌తో కలిసి మంగళవారం వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలం రాయవరం గ్రామానికి చెందిన దబ్బెట బాల్‌లింగం (30) అలియాస్ లింగం, బాబు, ప్రవీణ్‌రాజ్ పేర్లతో చలామణి అవుతున్నాడు. తన అమ్మానాన్నలతో కలిసి హైదరాబాద్‌లోని కాప్రాలో ఉంటున్నాడు. కాగా 7వ తరగతి చదువుతున్న సమయంలోనే స్నేహితులతో కలిసి దొంగతనానికి పాల్పడి జువైనల్ హోంకు వెళ్లాడు. బయటకు వచ్చిన తర్వాత దొంగతనాలనే వృత్తిగా మార్చుకుని ఉమ్మడి మెదక్ జిల్లా, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల్లో వందకు పైగా దొంగతనాలు చేసి పలు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో సిద్దిపేట పట్టణం రంగధాంపల్లి శివారులోని విఘ్నేశ్వర నగర్‌లో కృష్ణమూర్తి శర్మ ఇంట్లో ఈ ఏడాది మే 8న 10.5 గ్రాముల బంగారు నగలు దోచుకున్నాడు. అప్పట్లో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం నిందితుడు సిద్దిపేటకు వస్తున్నాడనే పక్కా సమాచారంతో పోలీసులు బీజేఆర్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుండి 10.5 తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని పట్టుకోవడంలో చొరవ చూపిన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు.

స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.49 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరుతో ఓ ఉద్యోగిని బురిడీ కొట్టించి నగదు కాజేశారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ విజయ్ కృష్ణ కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కర్దనూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 6న స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ బాధితుడికి వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలు నమోదు చేశాడు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకుడు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చాడు. బాధితుడు నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ.49 లక్షల 40 వేలు పెట్టుబడి పెట్టాడు. ఈ క్రమంలో తాను పెట్టిన నగదు తోపాటు లాభాలు ఇవ్వాలని బాధితుడు అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి ముందుగా సైబర్ క్రైమ్, మంగళవారం బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెక్‌డ్యాంలకు నిధుల జాడేది?


కర్నాటక వైపు వెళుతున్న నీరు

- ప్రతిపాదనలకే పరిమితం
- నారింజ నీరు కర్నాటక పాలు
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలో శాశ్వత నీటి వనరులు లేవు. భారీ, మధ్య తరహా ప్రాజెక్టులు లేక రైతులు బోరుబావులపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. నారింజ ప్రాజెక్టు ఉన్నా ఆయకట్టుకు నీరు అందించలేని స్థితిలో ఉంది. దీంతో భూగర్భ జలాలు పెంచాలని నిర్ణయించి చెక్‌డ్యాంల నిర్మాణానికి నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఏడాది గడుస్తున్నా ఇంత వరకు నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామం వద్ద సుమారు ఆరు దశాబ్దాల క్రితం నారింజ ప్రాజెక్టును 600 ఎకరాల్లో నిర్మించారు. 15 ఫీట్ల ఎత్తులో ఉన్న ప్రాజెక్టులో సుమారు ఒక క్యూసెక్కు నీటి నిలువ ఉంటుంది. వేయి ఎకరాలకు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టును కట్టారు. కానీ కుడి, ఎడమ కాలువల నిర్మాణ లోపం వల్ల ఇప్పటి వరకు ఎకరం పొలానికి కూడా నీరందలేదు. దీంతో ప్రాజెక్టును ఊట చెరువుగా మార్చేశారు. శాశ్వత నీటి వనరులు లేని ప్రాంతంలో ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని రైతులు, ఉద్యమకారులు, తదితరులు ఎన్నోసార్లు ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వాలు మారినా దాని గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా ప్రతి సంవత్సరం రెండు మూడు టీఎంసీల నీరు కర్నాటక రాష్ట్రానికి తరలిపోతుంది.

రూ.24.26 కోట్లతో ప్రతిపాదనలు

నారింజ ప్రాజెక్టులో సుమారు ఒక క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. ఒకటి, రెండు భారీ వానలకే ప్రాజెక్టు నిండిపోయి జలకళ సంతరించుకుంటుంది. వర్షాకాలం భారీ వానలు పడితే గేట్లు ఎత్తి ఆ నీరంతా వృథాగా కర్నాటకకు వదిలేస్తున్నారు. ప్రతి సంవత్సరం రెండు, మూడు టీఎంసీల నీరు తరలిపోతుంది. నీరు పక్క రాష్ట్రం పాలు కాకుండా ఉండేందుకు ప్రాజెక్టు కింద చెక్‌డ్యాంలు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.24.26 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మండలంలోని నారింజ వాగుపై బుర్దిపాడ్, బూచినెల్లి, సత్వార్, చిరాగ్‌పల్లి గ్రామాల శివారులో చెక్‌డ్యాంలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంత వరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేవు. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి చెక్‌డ్యాంల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రెండు రోజులుగా..

రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుకు వరద నీరు వచ్చింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తివేశారు. దీంతో పెద్ద ఎత్తున నీరు కర్నాటక వైపు వెళ్తుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ వానలు పడిన సందర్భాల్లో ఇలా నీరు వృథాగా పోతుంది. చెక్‌డ్యాంల విషయమై ఇరిగేషన్ డీఈని వివరణ కోరగా.. ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైతే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.